సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 1 । మార్చి । 2024



వైఎస్సార్‌సీపీలోకి వలసలు

వేంపల్లె మండలంలో 400 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. -8లో



తగ్గిన రైల్వే చార్జీలు

కరోనా కాలంలో ప్యాసింజర్ రైళ్లలో కనీస చార్జి రూ.30 ఉండేది.కేంద్ర ప్రభుత్వం దీనిని రూ.10కి తగ్గించడంతో పేద ప్రయాణికులకు ఊరట లభించింది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.5/19.3

వాతావరణం

జిల్లాలో గురువారం 19.3 – 36.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

6న జాబ్‌మేళా

బద్వేలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 6న రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రముఖ కంపెనీల ద్వారా 517 ఉద్యోగాలకు సంబంధించి నిర్వహించే ఈ జాబ్‌మేళాకు పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వంటగ్యాస్‌పై అదనపు చార్జీలు వసూలు చేయరాదు

కడప సెవెన్‌రోడ్స్: వంట గ్యాస్ సిలిండర్‌పై వినియోగదారుల బిల్లులో ఉన్న మొత్తం కంటే అదనంగా ఛార్జీలు వసూలు చేయరాదని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు గ్యాస్ డెలివరీ బాయ్స్, ఏజెన్సీ యజమానులు తమ గోడౌన్ నుంచి డెలివరీ పాయింట్ దూరంగా ఉన్నందున రవాణా చార్జీలు కూడా చెల్లించాలంటూ వినియోగదారుల వద్ద అదనపు మొత్తాన్ని వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కంపెనీల ఎల్‌పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లకు అధిక ధరలు వసూలు చేయరాదని గతంలోనే ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎవరైనా డెలివరీ బాయ్స్ అదనంగా వసూలు చేస్తే వినియోగదారులు జిల్లా సరఫరా అధికారి లేదా సంబంధిత సేల్స్ ఆఫీసర్ లేదా ఆయిల్ కంపెనీకి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే 1967/ 1800/233/ 3555 అనే టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఎగబాకుతున్న పసుపు ధర



కడప మార్కెట్‌యార్డుకు వచ్చిన పసుపు

కడప అగ్రికల్చర్: పసుపు ధర రోజురోజుకు ఎగబాగుతోంది. కొద్ది రోజులుగా క్వింటా రూ. 10 వేలు పైనే ధర కొనసాగుతుంది. తాజాగా గురువారం ఫింగర్ రకం క్వింటాల్ అత్యల్ప ధర రూ. 11,752 పలకగా అత్యధిక ధర రూ. 12,726 పలికింది. అలాగే బల్బు ధర క్వింటా అత్యల్పం రూ. 10515 పలకగా, అత్యధికం రూ.11969 పలికింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సాగు చేసిన కొత్త పసుపు జిల్లాలో చాలా చోట్ల రైతులు తవ్వుతున్నారు. కొత్త పసుపు కూడా మార్చి నెలలో మార్కెట్‌యార్డుకు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు లేకపోవడంతో ఈ ధర పలుకుతోందని, కొత్త పసుపు వస్తే ధర కాస్త తగ్గొచ్చని మార్కెట్‌యార్డు వర్గాలు తెలిపాయి.

సౌత్‌జోన్ పోటీలకు జట్ల ఎంపిక



ఎంపికైన జట్టుతో అధ్యాపకులు

వేంపల్లె: రాజీవ్‌గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాయం పరిధిలోని ఇడుపులపాయ, ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అంతర్ విశ్వవిద్యాలయాల జట్ల ఎంపికలు నిర్వహించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కమార్ స్వామి, గుప్తా అన్నారు. గురువారం ఆర్జీయూకేటి పరిధిలోని ఒంగోలు, నూజివీడు శ్రీకాకుళం ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీల్లో చదివే విద్యార్థులకు హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికలు జరిగాయి. కోచ్‌లుగా రామకృష్ణారెడ్డి, రాజశేఖర్‌లు వ్యవహరించారు. ఎంపికైన జట్లు మార్చి నెలలో కేరళలో జరిగే ఇంటర్ యూనివర్సిటి సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డైరెక్టర్, ఏఓ రాంభూపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు,శంషాద్‌బేగం, పీవీ రమణారెడ్డి, బాలకొండయ్య జట్టుకు ఎంపికైన వారిని అభినందించారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

రాజుపాళెం: విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెల్లాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడ చదివే విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి , పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. విద్యార్థులకు మార్కులే ప్రామాణికం కాదని పబ్లిక్ పరీక్షల్లో అనుకున్న మార్కులు రాకుంటే బాధపడొద్దన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ క్రిష్టఫర్, ప్రిన్సిపాల్ తులశమ్మ, టీచర్లు, కంప్యూటర్ ఆపరేటర్ సుదర్శన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థీ.. విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- నిఘానీడలో పరీక్షల నిర్వహణ



పరీక్షా కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న ఆర్‌ఐవో వెంకటసుబ్బయ్య



సీసీ కెమెరాల ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌ను పరిశీలిస్తున్న ఇంటర్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, ఆర్‌ఐవో వెంకటసుబ్బయ్య



జిల్లాలో పరీక్ష కేంద్రాలు: 69
ఇంటర్ ప్రథమ సంవత్సర జనరల్ విద్యార్థులు : 14903
ఒకేషనల్‌కు సంబంధించి : 1274
ద్వితీయ సంవత్సరం జనరల్: 16745
ఒకేషనల్ విద్యార్థులు : 1353
చీఫ్‌లు, డిపార్టుమెంట్ అధికారులు: 138
ఇన్విజిలేటర్లు : 1205
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు: 03
సిట్టింగ్ స్క్వాడ్ 02

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ఇంటర్‌బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ పేపర్లతో పరీక్షలు మొదలు కానున్నాయి. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 12 వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 9 గంటలు దాటిన తరువాత ఒక్కరిని కూడా లోపలికి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. అలాగే పరీక్ష విధులకు హాజరయ్యే సిబ్బంది కేంద్రంలోకి సెల్‌ఫోన్స్ తీసుకురాకూడదని ఇంటర్‌బోర్డు ఆదేశించింది. చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రం సమాచారం తెలిపేందుకు బటన్ ఫోన్‌ను అనుమతించారు. అది కూడా సమాచారం పంపగానే ఆఫీసు రూములో పెట్టాల్సి ఉంటుంది.

జిల్లాలో 69 పరీక్ష కేంద్రాలు...

జిల్లాలో 69 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ కళాశాలలు 18, ఎయిడెడ్ కళాశాల ఒకటి, గురుకుల పాఠశాలలు 4, మోడల్ స్కూల్ ఒకటి, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 44, ఒక హైస్కూల్ ప్లస్‌ను సిద్ధం చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 34,275 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు 1205 మంది ఇన్విజిలేటర్లు, 69మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 69 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. 23 మంది సెంటర్ కస్టోడియన్లు పరీక్షలను పర్యవేక్షించనున్నారు.ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది.

- పరీక్షలకు సంబంధించిన సామగ్రి ఇప్పటికే పోలీసు పహారాలో కేంద్రాలకు చేరింది.
- పరీక్షకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.
- మెడికల్ సిబ్బందితో ప్రాథమిక చికిత్స సేవలు అందుబాటులో ఉన్నాయి.
- పరీక్ష కేంద్రాల్లో 1095 సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు.
- బస్సు సౌకర్యం ఉన్న విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను చూపించి ఉచితంగా బస్సు ప్రయాణం చేసేలా ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. ఇందుకోసం ఆర్టీసీ పలు రూట్లకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది.
- పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేస్తారు.
- పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్, డిజిటల్ వాచ్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.

జిల్లాలో 10 సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు

జిల్లాలో 10 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఇందులో గండిలోని ఏపీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, దువ్వూరు, ముద్దనూరు, ఖాజీపేట, లింగాల, ఎర్రగుంట్ల, తొండూరు, సింహాద్రిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, బిమఠం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, కమలాపురం సొసియల్ వెల్ఫేర్ స్కూల్స్‌ను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు.

టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు...

కడప ఆర్‌ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే ఈ కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన 08562-244171 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ఏర్పాట్లు పూర్తి



ఇంటర్ పరీక్షలను పారదర్శంగా నిర్వహించేందుకు,విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశాం. సిబ్బంది సహకరించి పరీక్షలను పకబ్బందీగా నిర్వహించాలి.
– శ్రీనివాసులరెడ్డి, డీవీఈఓ, ఇంటర్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్

పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. జిల్లా వ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశాం. అన్ని కేంద్రాల్లోని తరగతి గదుల్లో సీసీ కెమెరాలను అమర్చాం. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షల తనిఖీ కోసం ఫ్లయింగ్,సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించాం. పరీక్షలకు సంబంధించి సెల్‌ఫోన్స్ దారా వచ్చే వదంతులను తల్లిదండ్రులు నమ్మవద్దు. –బండి వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐవో, ఇంటర్ విద్య

మానవాళి శ్రేయేస్సుకే సనాతన ధర్మం

శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి



జగద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతీ స్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

కడప కల్చరల్: మన జాతి ఎంతగానో గౌరవించే సనాతన ధర్మం సర్వ మానవాళి శ్రేయస్సు కోసమే ఉద్దేశించినట్లు కంచి శ్రీ కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి అన్నారు. గురువారం ఆయన తన విజయాత్రలో భాగంగా కడప నగర శివార్లలోని చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో గల శ్రీ లలితా పంచాయతన ఆలయానికి విచ్చేశారు. ఆలయ నిర్వాహకులు స్వామి తురియానంద సరస్వతి, అర్చకులు, వేద పండితులు, ధార్మివేత్తలు, నగర ప్రముఖులు, భక్తులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన త్రికాల పూజను ప్రారంభించారు. అందులో భాగంగా ఆదిశంకరాచార్యుల మహా ప్రసాదమైన అరుదైన శ్రీ చంద్రమౌళీశ్వర స్ఫటిక లింగంతోపాటు మహామేరువు శ్రీ చక్రాలతో విశేష పూజలు, అభిషేక కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం కంచి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖర సరస్వతిస్వామి జీవిత విశేషాలను వివరించారు. సాయంత్రం ధ్యాన మందిరంలో భక్తులతో సత్సంగం నిర్వహించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు స్వామి తురియానంద సరస్వతి చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో గ్రామ ప్రాంతాల్లో శాంతి సాధన కోసం చేసిన కార్యక్రమాల గురించి వివరించారు.

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలి

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలని ఎంసీసీ టాస్క్‌ఫోర్స్ అధికారులను కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎంసీసీ అమలుపై టాస్క్‌ఫోర్స్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఏ విధంగా పనిచేశారో అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా పనిచేయాలన్నారు. నిర్దేశిత తేదీల్లో పోలింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. 324 ఆర్టికల్ (కంప్లీట్ కంట్రోల్ సూపర్‌విజన్) ప్రకారం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను అమలు చేస్తామన్నారు. ఐపీసీ సెక్షన్ 123 ద్వారా ఓటర్లను మభ్యపెట్టే ఎలాంటి చర్యలైనా నిబంధనల ఉల్లంఘన కింద పరిగణించాలన్నారు. డబ్బులు పంచినా, తీసుకున్నా నేరం కింద కేసు నమోదు చేయాలని చెప్పారు. పార్టీల లోగోలు, జెండాలు, బ్యానర్లు అనుమతి లేకుండా ప్రదర్శించేందుకు వీలు లేదన్నారు. ప్రచార సమయం, పబ్లిసిటీ లౌడ్‌స్పీకర్లకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రాజకీయ ప్రభావాన్ని చూపే వ్యక్తుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ఫ్లెక్సీ ప్రింటర్స్ వివరాలు లేకుండా బ్యానర్లు ముద్రిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫొటోలు తొలగించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే ఎంసీసీ అమలులోకి వస్తుందన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలలో ఎలాంటి రాజకీయ సమావేశాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీలు, మండలాల్లో ప్రజలకు తాగునీరు, పారిశుధ్య నిర్వహణ ఏమాత్రం లోపం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, ఎంసీసీ నోడల్ అధికారి నందన్, జిల్లా మాస్టర్ ట్రైనర్, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ అధికారులైన మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



నాగలగుట్టపల్లె వద్ద భూపంపిణీ సందర్భంగా పట్టాలను అందజేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

చక్రాయపేట: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, వారికి మంచి చేయాలి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సంకల్పం మది నిండుగా పెట్టుకొని పాలన సాగిస్తున్నారని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లె వద్ద జరిగిన మండలంలో భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈసందర్భంగా మండలంలో 7 గ్రామాలకు చెందిన 400 మంది నిరుపేదలకు సుమారు 600 ఎకరాల భూమిని పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు భూపంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.గత ప్రభుత్వాల హయాంలో భూపంపిణీ కార్యక్రమం జరగలేదని చెప్పారు.బ్యాంకుల్లో ఉన్న బంగారం నేను విడిపిస్తాను, మీరు ఒక్క పైసా చెల్లించొద్దని చెప్పి అధికారంలోకి రాగానే ఆ విషయాన్ని గాలికి వదిలేసి మహిళలను మోసం చేసిన వ్యక్తి ఎవరంటే అది చంద్రబాబునాయుడు అని అన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పి వారిని కూడా మోసగించారన్నారు. అలాంటి చంద్రబాబు ఇప్పుడు మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు ముందుకు వస్తున్నారని, అలాంటి వ్యక్తిని నమ్మొద్దని చెప్పారు. .ఇచ్చిన మాటకు కట్టు బడి నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేసి మీ గుండెల్లో నిలిచిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలతోపాటు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని చెప్పారు.కార్యక్రమంలో పులివెందుల ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి,మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి,ఎంపీపీ మాధవి,జెడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, సర్పంచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చదువులకు నిశ్చింత

ప్రభుత్వం పేదల విద్యకు పెద్ద పీట వేసింది. విద్యార్థుల చదువులకు తంఛన్‌గా ఫీజులను చెల్లిస్తోంది. దీంతో పేద విద్యార్థులు విద్యా వంతులుగా మారుతున్నారు.నవసమాజం వైపు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న నిర్ణయాత్మక, విప్లవాత్మక మార్పుల పట్ల హర్షం వ్యక్త చేస్తున్నారు.

- నేడు 2023–2024 విద్యా సంవత్సరానికి 'జగనన్న విద్యా దీవెన' డబ్బులు విడుదల
- జిల్లాలో 44,876 మందికి లబ్ధి
- రూ 34.52 కోట్లకు పైగా జమ





కడప రూరల్: పేదల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో భాగంగా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను ప్రవేశపెట్టారు. ఫలితంగా పేద విద్యార్థులు నిశ్చింతగా చదువును సాగిస్తున్నారు. జగనన్న విద్యా దీవెన కింద ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర విద్యా కోర్సులను అభ్యసించే పేద విద్యార్థులకు ప్రభుత్వం పూర్తి ఫీజులను చెల్లిస్తోంది. ఫీజులకు సంబంధించిన నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ నిధులను మూడు నెలలకు ఒక సారి చొప్పున ఒక ఏడాదిలో నాలుగు విడతలుగా తంచన్‌గా విడుదల చేస్తున్నారు. కాగా 2023–2024 విద్యా సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, ముస్లిం, క్రిస్టియన్ వర్గాలకు చెందిన మొత్తం 44,876 మంది విద్యార్థులు 300 కాలేజీల్లో చదువుకొంటున్నారు. వీరికి మొదటి విడత కింద విద్యార్థుల తల్లుల ఖాతాలకు మొత్తం రూ 34,52,64,997 జమ కానుంది.

గతమంతా గందరగోళం...

గత తెలుగుదేశం పార్టీ పాలనలో ఫీజుల పథకం గాలిలో దీపంలా మారింది. నాటి ప్రభుత్వం సక్రమంగా కాలేజీలకు ఫీజులను చెల్లించేది కాదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి, మనోవేదనకు గురయ్యేవారు. ఫలితంగా పరీక్షల సమయంలో వారిని ఫీజుల కష్టాలు వెంటాడేవి. కాలేజీ యాజమాన్యాలు ఫీజుల చెల్లిస్తేగాని హాల్ టికెట్స్ ఇచ్చేవారు కాదు.

ఇప్పుడు ఆత్మవిశ్వాసంతో చదువులు...

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక విద్యా రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశారు. దేశం యావత్తు అబ్బుర పడేలా విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా విద్యార్థులు నిశ్చింతగా ఉంటున్నారు. చిరునవ్వులతో చదువులు సాగిస్తున్నారు. సరస్వతీ పుత్రులుగా మారి..విద్యా వేత్తలుగా ఎదుగుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో అమలు చేస్తున్న పథకాల పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

జగనన్న విద్యా దీవెన కింద 2023-2024 విద్యా సంవత్సరానికి నిధుల చెల్లింపుల వివరాలు

వర్గం	విద్యార్థులు	నిధుల విడుదల
ఎస్సీ	8,193	రూ.5,33,44,440
ఎస్టీ	677	రూ.46,35,898
బీసీ	16,587	రూ.12,36,27,544
ఈబీసీ	7,587	రూ.7,70,22,500
కాపు	6,141	రూ.5,00,74,134
ముస్లిం	5,591	రూ.3,58,54,127
క్రిస్టియన్	100	రూ.7,06,354
మొత్తం	44,876	రూ.34,52,64,997

నేడు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ....



ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన కింద 2023–2024 విద్యా సంవత్సరానికి మొదటి విడత కింద విద్యార్థుల కాలేజీ ఫీజులను నేడు తల్లుల ఖాతాలకు జమ చేస్తుంది. జవాబు దారి కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలేజీ ఫీజులను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పోత్సాహాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు విద్యా వేత్తలుగా ఎదగాలి.
– సరస్వతి, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ

ఏపీ టెట్‌కు 1358 మంది హాజరు



కడపలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెంకటకృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు(ఏపీటెట్–2024) కంప్యూటర్ బేస్డ్ పరీక్ష జిల్లావ్యాప్తంగా మూడో రోజు గురువారం ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు నిర్ణీత సమయానికన్నా ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షకు సంబంధించి గురువారం ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో కడపలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో, పొద్దుటూరులో రెండు పరీక్షా కేంద్రాల్లో 1525 మంది విద్యార్థులకు 1358 మంది హాజరయ్యారు. కడపతోపాటు పొద్దుటూరులోని పరీక్షా కేంద్రాలను ఏపీ టెట్ జిల్లా అబ్జర్వర్ మార్తాల వెంకట కృష్ణారెడ్డి పరిశీలించారు.

వీరభద్రుడి బ్రహోత్మవ ఏర్పాట్ల పరిశీలన

రాయచోటి అర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మార్చి 5 నుంచి 15వ తేదీ వరకు జరిగే రాయచోటి వీరభద్రుడి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆలయ కార్య నిర్వహణ కార్యదర్శి రమణారెడ్డితో కలసి గురువారం ఎపరిశీలించారు. ఆలయం మాడవీధులు, స్వామి వారం రథం తిరిగే వీధులను పరిశీలించారు. ఇతర రాష్ట్రాల నుండి వేలసంఖ్యలో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో ప్రజారోగ్యం దృష్ట్యా ప్రత్యేక శానిటేషన్ టీంలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

తగ్గిన రైల్వే చార్జీలు

- కరోనా కాలంలో కనీస చార్జీ రూ.30
- ప్రస్తుతం రూ.10కి తగ్గించిన రైల్వేశాఖ
- పేదోళ్ల రైలు ప్రయాణం ఇక సులభతరం
- మూడు ప్యాసింజర్ రైళ్లకు వర్తింపు

ప్యాసింజర్ రైళ్లు

హుబ్లీ – తిరుపతి	ప్యాసింజర్
నంద్యాల – రేణిగుంట	డెమో
కడప – అరకోణం	ప్యాసింజరు



నంద్యాల-రేణిగుంట మధ్య నడిచే డెమో ప్యాసింజర్

రాజంపేట : దేశంలో మొదటిసారి కరోనా విజృంభించిన సమయంలో రైల్వేశాఖ ప్రజారవాణా విషయంలో నిబంధనలు కఠినతరం చేసింది. ప్రత్యేక రైళ్లను నడిపించిన క్రమంలో ప్యాసింజర్ రైళ్ల టికెట్ ధరలు పెంచింది. ఇప్పుడు ఆ ధరలను రద్దు చేసింది. దీంతో పేదవాడి ప్రయాణానికి ఊరట లభించింది.

ప్యాసింజర్ రైళ్లు ఇవే..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రైలుమార్గంలో తిరుపతి-హుబ్లీ మధ్య నడిచే ఇంటర్‌సిటీప్యాసింజరు, కడప-అరకోణం మధ్య నడిచే ప్యాసింజరు, నంద్యాల-రేణిగుంట మధ్య నడిచే డెమో ప్యాసింజర్లలో పేదవాడి రైలుప్రయాణం తక్కువ ధరలో ఉంటుంది. ఇప్పటి వరకు ఈ రైళ్లలో ప్రయాణంలో కనీస చార్జి రూ.30కి పెంచిన సంగతి తెలిసిందే.

రూ.30టికెట్ ధర ఇకపై రూ.10కే

ప్యాసింజర్, పుష్‌పుల్ రైలు ప్రయాణికులకు శుభవార్త. ఈ రైళ్లలో ప్రయాణించే కనీస చార్జీని రూ.10కి తగ్గించారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతనెల 27 నుంచి అమలులోకి తీసుకొచ్చింది. కరోనా కాలంలో సదరు చార్జీని రూ.30కి పెంచారు. రైల్వేశాఖ తాజా నిర్ణయంతో లక్షలాది మంది పేద ప్రయాణికులపై భారం తగ్గనుంది. కనీసచార్జిని భారతీయ రైల్వేకి సంబంధించి క్రిస్‌లో ఫీడింగ్ చేశారు.

కడప నుంచి రైల్వే చార్జీల వివరాలు

స్టేషన్	స్టేషన్	కొత్తచార్జి(రూ)
కడప	తిరుపతి	30
కడప	రేణిగుంట	30
కడప	కోడూరు	25
కడప	రాజంపేట	15
కడప	నందలూరు	10
కడప	కమలాపురం	10
కడప	ఎర్రగుంట్ల	10
కడప	కొండాపురం	25
కడప	గుత్తి	35
కడప	గుంతకల్	40
కడప	బళ్లారి	50
కడప	హోస్పేట్	65
కడప	హుబ్లీ	85
కడప	ప్రొద్దుటూరు	15
కడప	జమ్మలమడుగు	20
కడప	నంద్యాల	45
కడప	అరక్కోణం	45
కడప	తాడిపత్రి	25

కరోనా నాటి చార్జీలు తగ్గించడం సంతోషం



కరోనా కాలం ప్యాసింజర్ రైళ్లలో కనీస చార్జి రూ.30 ఉండేది. ఫలితంగా పేదవాడి ప్రయాణం భారంగా మారింది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కరోనా కాలం నాటి చార్జీని రూ.10కి తగ్గించడంతో పేద ప్రయాణికులకు ఊరట లభించింది. జిల్లా మీదుగా మరికొన్ని ప్యాసింజర్ రైళ్లను తీసుకురావాలి

– షేక్ జావిద్, కూరగాయల వ్యాపారి

కనీస చార్జిని రూ.10 చేయడం ఊరట



కరోనా కాలంలో తీసుకొచ్చిన కనీస చార్జీని తగ్గించారు. జిల్లామీదుగా ఉన్న మూడు ప్యాసింజర్ రైళ్లలో కనీస చార్జి రూ.10కి పెట్టడం శుభపరిణామం. పేద, మధ్యతరగతి ప్రయాణాలు అధికంగా జరిగే అవకాశాలు ఉంటాయి. రైల్వేశాఖ పేదల ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్యాసింజర్ రైళ్ల సంఖ్యను పెంచాలి.

– పొన్నాల చలపతి గౌడ్, అరటికాయలవ్యాపారి



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ సచివాలయం ద్వారానే వస్తాయని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాము. రెండు రోజుల వ్యవధిలోనే దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగానే అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ కూడా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము.

– ఏనుగు వెంగమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

పాఠశాలకు కొత్త హంగులు



నాడు–నేడుతో మా పాఠశాలకు కొత్త హంగులు వచ్చాయి. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఇంగ్లీషు మీడియంలో బోధిస్తున్నాం. విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలతో పాటు జగనన్న విద్యాకానుక ఇచ్చాము. పిల్లలకు జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం అందుతోంది. గతంలో కంటే ప్రస్తుతం పాఠశాల బాగుపడింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలవ వల్లే విద్యాశాఖకు మహర్దశ పట్టింది.

– షరాఫత్‌అలీఖాన్, స్కూల్ అసిస్టెంట్, బాలాజీనగర్ ఉర్దూ ఉన్నత పాఠశాల, మదనపల్లె.

క్లుప్తంగా

ట్రాక్టర్ పంపు సెట్టు కింద పడి రైతు మృతి



మృతిచెందిన లక్షుమయ్య

రాజుపాళెం : మండలంలోని ద్రపాడు గ్రామానికి చెందిన జిల్లి లక్షుమయ్య (39) అనే రైతు గురువారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు లక్షుమయ్య తన నువ్వు పంటకు ట్రాక్టరు సాయంతో నీటి తడులు అందించేందుకు సిద్ధమయ్యాడు. ప్రమాదవశాత్తు లుంగీ సాప్టుకు తగలడంతో తలకు వెనుక భాగం, శరీరంపై బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లక్షుమయ్య మృతి చెందిన విషయం భార్య, పిల్లలకు తెలియడంతో బోరున విలపించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య జిల్లి రామలక్షుమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.తులసీ నాగ ప్రసాద్ తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏఎస్ఐ సుబ్బారెడ్డి పరిశీలించారు.

రెండో చోట్ల వ్యవసాయ మోటార్లు చోరీ



వ్యవసాయ మోటార్ పంపు చోరీకిగురి కాగా మిగిలిన పైపులైను

చాపాడు : చాపాడులోని మైదుకూరు రోడ్డులో ఇద్దరు రైతుల పొలాల్లోని వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. సర్వే నంబరు 53/3ఏ లోని రాజోలి దొరస్వామిరెడ్డి పొలంలోని మోటార్ పంపు, దీని సమీపంలోని సర్వే నంబరు 59ఏ లోని వ్యవసాయ పొలంలోని విద్యుత్ మోటార్ బాడీని గుర్తు తెలియని దొంగలు అపహరించినట్లు బాధిత రైతులు తెలిపారు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం సాగునీరు పెట్టుకునేందుకు పొలం వద్దకు వెళ్లగా వ్యవసాయ మోటార్లు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

దొంగతనం కేసులో ఐదుగురికి జైలు శిక్ష

సంబేపల్లె : మండలంలోని శెట్టిపల్లి గ్రామం, కొత్తపల్లి బిడికి నాగరప్పమ్మ గుడిలో పది నెలల క్రితం జరిగిన చోరీ కేసులో ఐదుగురు ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ గురువారం కోర్టు తీర్పు వెలువరించింది.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు



రాజీవ్ కాలనీలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : వేంపల్లె మండలంలోని సుమారు 400 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక రాజీవ్ కాలనీలో బళ్లారపు రవి , సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, కుమ్మర వీధిలో ప్రభాకరరెడ్డి, సుబ్బరాయుడు ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు పార్టీలో చేరారు. అలాగే వైఎస్సార్ గెస్ట్‌హౌస్‌లో డక్కా శ్రీనివాసులు, కురుముట్ల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో 250 కుటుంబాల వారు, మానవత స్వచ్ఛంద సంస్థ మండల అధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చూస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల ద్వారా ప్రజలందరికి ఎంతో మేలు జరుగుతోందన్నారు. అంతేకాకుండా వేంపల్లె మండలంలో సుమారు రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మీకు మేలు జరిగి ఉంటేనే మళ్లీ ఎన్నికల్లో తమకు ఓటు వేయాల ధైర్యంగా చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ ఎంపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజీవ్ కాలనికి స్మశాన వాటిక కావాలని ఎంపీని అడగగా ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజా రవాణాధికారికి ఎండీ ప్రశంసలు



ఎండీ ద్వారక తిరుమలరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో గత అక్టోబరు 26 నంంచి నవంబరు 25వ తేదీ వరకు జరిగిన కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల సందర్భంగా పెద్ద మొత్తంలో బుకింగ్‌లు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డిని ఎండీ ద్వారక తిరుమల రావు అభినందించారు. గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అలాగే డిపోల వారీగా అధిక బుకింగ్ చేయించిన ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డిని కూడా ఎండీ ప్రశంసించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలోని ప్రొద్దుటూరు డిపో పరిధిలో 5906, జమ్మలమడుగు 1175, మైదుకూరు 1728, బద్వేలు 1394, కడప 3532, పులివెందుల డిపో పరిధిలో 1031 పార్సిళ్లను బుక్ చేసి రూ. 9.08 కోట్ల ఆదాయాన్ని ఆర్జించామన్నారు. ఈ ఘనతను సాధించేందుకు కృషి చేసిన కార్గో సిబ్బంది, ఆర్టీసీ అధికారులు, డీఎంలు, సూపర్‌వైజర్లు, అధికారులు, ఏటీఎం (కమర్షియల్)లను ఆయన అభినందించారు.

జోన్ పరిధిలోని ఇతర ఆర్ఎంలకు కూడా...

సంస్థ పురోభివృద్ధికి పాటుపడిన ఇతర ఆర్ఎంలను కూడా ఎండీతోపాటు ఈడీ గిడుగు వెంకటేశ్వర రావు అభినందించారు. సంక్రాంతి స్పెషల్ ఆపరేషన్స్‌లో ఎక్కువ కిలోమీటర్లు, అధిక ఆదాయం తెచ్చినందుకు తిరుపతి జిల్లా ఆర్ఎం చెంగల్ రెడ్డి, సత్యసాయి జిల్లా ఆర్ఎం మధుసూదన్, శబరిమల స్పెషల్ ఆపరేషన్స్ ఎక్కువ చేసినందుకు అన్నమయ్య జిల్లా ఆర్ఎం రాములుకు ప్రశంసాపత్రం అందజేశారు. జోన్ –4 పేరును నిలబెట్టినందుకు ప్రజా రవాణా అధికారులను అభినందించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీలో 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలను ఒకే సారి చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు విడతల డీఏలను మంజూరు చేయాలన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను, సరెండర్ లీవు బిల్లులు, మెడికల్ లీవు బిల్లులును చెల్లించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, అఫ్సర్ బాషా, సుబ్బయ్య, సయ్యద్‌బాషా, నరసింహకుమార్, రాజారెడ్డి, మల్లికార్జున, కొండారెడ్డి, నారాయణరెడ్డి, బాబుల్‌రెడ్డి, అమీన్, జహంగీర్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో చిన్నారి మృతి



మృతి చెందిన నందిని

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామ కస్పాకు చెందిన వీరయ్య, ప్రాణేశ్వరిల కుమార్తె నందిని(4) అనే చిన్నారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. స్వగృహంలోని ఇంటి ముందు చిన్నారి అనుమానాస్పదంగా ఉరేసుకున్న రీతిలో మృతిచెంది ఉందన్నారు. చిన్నారి తల్లి ప్రాణేశ్వరి వలంటీర్‌గా పనిచేస్తుండగా భర్త వీరయ్య వ్యవసాయ పనులు చేస్తుండేవారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తుల సౌకర్యాలకే తొలి ప్రాధాన్యత

– దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్



కడప కల్చరల్ : జిల్లాలో మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారని, ఇందులో భక్తుల సౌకర్యాలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులు ఆదేశించారని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శివరాత్రి నిర్వహణపై జిల్లా కలెక్టర్ తమకు ప్రత్యేక సూచనలు చేశారన్నారు. ప్రముఖ శివాలయాలన్నీ అటవీ ప్రాంతాల్లోనే ఉంటాయి గనుక శివరాత్రి సందర్భంగా ఆయా క్షేత్రాలను దర్శించుకునేందుకు వెళ్లే భక్తుల సంఖ్య కూడా భారీగా ఉంటుందన్నారు. స్థానిక భక్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. అటవీ ప్రాంతాల్లో ఎండిపోయిన బోర్లను సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేసి భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పోలీసు అధికారులను కోరుతున్నామన్నారు. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను, వీలైనంత వరకు మినీ బస్సులను నడపాలని, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఉండదని భావిస్తున్నామన్నారు.

అత్యుత్తమ టెక్నాలజీతో 'భారతి సిమెంట్'



మేస్త్రీకి బీమా బాండ్ అందిస్తున్న టెక్నికల్ ఇంజనీర్

ముద్దనూరు : భారతి సిమెంట్ రోబోటిక్,జర్మనీ టెక్నాలజీలతో కూడిన అత్యుత్తమ టెక్నాలజీతో తయారవుతున్న పటిష్టమైన సిమెంట్ అని ఆ కంపెనీ జిల్లా టెక్నికల్ ఇంజనీర్ కె,నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం ముద్దనూరులో తాపీ మేస్త్రీలకు సిమెంట్ వినియోగం, నాణ్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ మరింత నాణ్యత కలిగిందన్నారు. ఇతర రకాల సిమెంట్ 5గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రా సిమెంట్ 2గంటల వ్యవధిలోనే పూర్తిగా సెట్ అవుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు రూ.1లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్‌లను అందజేశారు. సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డీలర్ మస్తాన్ పాల్గొన్నారు.

దొండ్లవాగులో అగ్నిప్రమాదం



కాలిబూడిదైన చీనీ చెట్లు

లింగాల : దొండ్లవాగు గ్రామంలో గురువారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 10 సంవత్సరాల వయసు గల 100 చీనీ చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు సమీపంలోని అడవికి నిప్పు పెట్టడంతో అది వైవీ సుబ్బారెడ్డి అనే రైతుకు చెందిన చీనీ తోటలోకి ప్రవేశించింది. దీంతో పొలం చుట్టూ ఉన్న కటవులకు నిప్పంటుకొని చీనీ చెట్లు కాలిపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు 10 సంవత్సరాల వయసు గల కాపుతో ఉన్న చీని చెట్లు కాలిపోయి రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని రైతు లబోదిబోమంటున్నాడు. నష్టపోయిన చీనీ రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

వైద్య వృత్తి పవిత్రమైందని గుర్తించాలి



మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ ఏక్యూ జవ్వాద్



ప్రమాణం చేస్తున్న విద్యార్థులు

'ఫాతిమా'లో 2018 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైద్య వృత్తి పవిత్రమైందిగా భావించాలని అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, ఫాతిమా మెడికల్ కళాశాల కరస్పాండెంట్ ఏక్యూ జవ్వాద్‌లు తెలిపారు. గురువారం సాయంత్రం 2018 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫాతిమా మెడికల్ కళాశాలలో ఇప్పటివరకు 700 మంది విద్యార్థులు వైద్య విద్య అభ్యసించారన్నారు. ఈ కళాశాల ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ అన్నింటిని అధిగమించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలో మైనార్టీ కళాశాల కడపలో ఏర్పాటు చేసి వందలాది మందిని వైద్యులుగా తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. ఎంబీబీఎస్ సాధించడం చెప్పుకునేంత సులభం కాదని, ఎంతోకష్టపడి ప్రణాళిక బద్ధంగా చదివాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల గురించి ఎన్నో కలలు కంటుంటారని, వాటిని వమ్ము చేయకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. అలాగే ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న వారు అటు వృత్తిలో రాణిస్తూ ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. జిల్లాకు చెందిన వైఎస్ఆర్ వైద్య విద్య పూర్తి చేసి వైద్యునిగా రాణిస్తూ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపును పొందారన్నారు. ఇలాంటి జిల్లాలో మీరు వైద్య విద్య పూర్తి చేసుకున్నందుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, ఫాతిమా కళాశాల చైర్మన్ సిద్దిఖీ, వైస్ చైర్మన్ ఫరూఖీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్, డైరెక్టర్ జయరామిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శైలారేఖ, మెడికల్ సూపరింటెండెంట్ ఓబులేసు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డిలు మాట్లాడుతూ వైద్య విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు మలి విడతగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శైలారేఖ ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేసుకున్న వారి చేత ప్రజా సేవపై ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.